ప్రజాశక్తి
సోమవారం 25 మార్చి 2024 5 అనంతపురం



'గుమ్మనూరు'కు గుంతకల్లు దక్కేనా ?

ఇప్పటికీ ఖరారుకాని అభ్యర్థిత్వం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



తాజా మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం ఎక్కడి నుంచి బరిలో దిగనున్నారన్న దానిపై చర్చ నడుస్తోంది. వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయనకు ఆ పార్టీ ఎక్కడి నుంచి బరిలో దింపనుందన్నది ఆసక్తికరంగా మారింది. ఆయన సొంత నియోజకవర్గం ఆలూరా లేక గుంతకల్లునా అన్నది చర్చ నడుస్తోంది. జయరాం రాజకీయ ప్రస్థానం ఆలూరు నుంచే మొదలైంది. అయితే ఇటీవల పార్టీ మారిన నేపథ్యంలో అంతకు ముందు నుంచి ఆలూరులోనున్న టిడిపి నాయకులకు అక్కడ అవకాశం కల్పిస్తూ ఇటు గుంతకల్లుకు జయరాంను తీసుకురానున్నారన్న వాదనలు వినిపిస్తూ వచ్చాయి. అందుకు అనుగుణంగా జయరాం సోదరులు సైతం గుంతకల్లు నియోజకవర్గంలో పర్యటించి ముఖ్య నేతలతోనూ సమావేశాలు నిర్వహించారు. అయితే స్థానిక గుంతకల్లు తెలుగుదేశం ముఖ్య నాయకులు మాత్రం పక్క జిల్లా నుంచి తీసుకొచ్చి ఇక్కడ టిక్కెట్టు ఇవ్వడాన్ని అంగీకరించడం లేదు. వరుసగా నిరసనలు, ఆందోళనలు కొనసాగిస్తూ ఉన్నారు. బోయ సామాజిక తరగతి ఎక్కువగానున్న గుంతకల్లులో బోయ సామాజిక తరగతికి చెందిన జయరాంను నిలుపడం ద్వారా ప్రయోజనముంటుందని పార్టీ భావిస్తున్నట్టు కొంత మంది నేతలు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు నియోజకవర్గంలో బాధ్యతలు చూస్తూ వచ్చిన ముఖ్య నేతలు కూడా ఇక్కడ బిసి సామాజిక తరగతికి చెందిన వారేనని చెబుతున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి జితేందర్ గౌడ్ బిసినే. ఆయన సోదరుడు సాయినాథ్ గౌడ్ కాలం నుంచి కూడా ఆ కుటుంబం టిడిపిలోనే ఉండి పనిచేస్తూ వస్తోంది. సాయినాథ్ గౌడ్ మరణం తరువాత జితేందర్‌గౌడ్ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఈయనతో పాటు కెసి నారాయణ కుటుంబ సభ్యులు టిక్కెట్టు ఆశిస్తున్న వారిలోనున్నారు. వీరిని కాదని పక్క జిల్లాలో అది కూడా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని వెంటనే ఇక్కడికి తీసుకొచ్చి టిక్కెట్టు ఇవ్వడాన్ని స్థానిక నాయకులు కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థిత్వ ఖరారులోనూ జాప్యం జరుగుతూ వస్తోంది. సమస్యాత్మకంగానున్న ప్రాంతాల్లో పెండింగులో ఉంచారు. ఈ రకంగా పెండింగులోనున్న వాటిల్లో అనంతపురం, గుంతకల్లు మాత్రమే జిల్లాలో ఉన్నాయి. గుంతకల్లు టిక్కెట్టు జయరాంకు ఇస్తే సహకరించబోమని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఈ అసంతృప్తులను ఏ రకంగా చల్లారుస్తారన్నది చూడాల్సి ఉంది. ఒకవేళ ఇక్కడ కుదరకపోతే కర్నూలు జిల్లాలోని ఆయన సొంత నియోజకవర్గమైన ఆలూరుకే తిరిగి పంపించే అవకాశాలూ లేకపోలేదన్న చర్చ నడుస్తోంది. తిరిగి ఆయన్ను పాత స్థానానికే పంపి ఇక్కడ స్థానిక నాయకులకే అవకాశం కల్పిస్తారా అన్నది చూడాల్సి ఉంటుంది. మొత్తంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో గుంతకల్లు నియోజకవర్గం హాట్‌టాపిక్‌గానూ మారింది. ఈ సీటు అభ్యర్థిత్వాన్ని త్వరలోనే తేలుస్తారా లేక మరికొంత సమయం పెండింగులో ఉంచుతారా అన్నది చూడాల్సి ఉంది.

'అనంత'లో ఆకలి చావు

- నాలుగేళ్లుగా విగ్రహం నీడనే జీవనం
- దయనీయస్థితిలో గర్భిణి మృతి
- కలెక్టరేట్ ఎదుటే ఘటన

యువత బంగారు భవిష్యత్తుకోసం ఓ వైపు ప్రభుత్వ యంత్రాంగం విద్య ఆవశ్యకత, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నా నేటి యువత తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటోంది. చదువుకోవాల్సిన వయస్సులో ప్రేమ వ్యామోహంలో పడి భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. తెలిసీ తెలియని వయసులో భవిష్యత్తుపై సరైన అవగాహన లేక తమ జీవితాలను అర్థాంతరంగా ముగించుకుంటున్నారు. ఇందుకు ఆదివారం అనంతపురం నగరంలో సాక్ష్యాత్తు కలెక్టర్ కార్యాలయం ఎదుట చోటు చేసుకున్న హృదయ విదాకర సంఘటనే సజీవ సాక్ష్యం.

ప్రజాశక్తి - అనంతపురం సిటీ

అనంతపురం నగరంలోని టీవీ టవర్ వద్ద నివసించే ఓ దళిత కుటుంబానికి చెందిన అంజలి అనే యువతి తన 14 సంవత్సరాల వయస్సులో బిసి సామాజికవర్గానికి చెందిన రాజు అనే యువకుడిని ప్రేమించింది. మైనార్టీ కూడా తీరని అంజలి పెద్దలను ఎదిరించి రాజును పెళ్లి చేసుకుంది. కొన్ని రోజులు వారి జీవనం సజావుగా సాగింది. వారికి ముగ్గురు సంతానం కలిగారు. ఈ నేపథ్యంలో రాజు తాగుడుకు బానిస అయ్యాడు. భార్య, పిల్లలను పట్టించుకోవటం మానివేశాడు. దీంతో వారి జీవనం కష్టంగా మారింది. ఆకుటుంబం నివసించడానికి నీడ కూడా కరువైంది. దీంతో కలెక్టర్ కార్యాలయం ఎదుట చెరువు కట్ట మీదకు వెళ్లే దారిలో ఉండే ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం కింద నాలుగు సంవత్సరాలుగా ఆ కుటుంబం జీనవం సాగిస్తోంది. ముగ్గురు పిల్లలను ప్రతి రోజూ దేవాలయాల వద్ద కూర్చొబెట్టి వచ్చిన డబ్బుతో రాజు మద్యం సేవించేవాడు. కొద్దో గొప్పో మిగిలిన డబ్బుతో ఏదైనా తిండి తెచ్చుకుని తినేవారు. ప్రస్తుతం అంజలి నాలుగు నెలల గర్భిణి. ఆమెకు కనీస పోషకాహారం లేకపోవటంతో బలహీనంగా మారింది. ఈ నేపథ్యంలో అంజలి శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఎదుట రోడ్డు దాటుతున్న సమయంలో ఆమెను ద్విచక్రవాహనం ఢీకొంది. అయితే ఈ ప్రమాదంలో అంజలి కిందికి పడినా తిరిగి పైకి లేచి నడుచుకుంటూ విగ్రహం వద్దకు వెళ్లింది. రాత్రి 2 గంటల సమయంలో అంజలి తన భర్త రాజును నిద్రలేపి తనకు ఆకలిగా ఉందని చెప్పింది. అయినా అతను పట్టించుకోలేదు. ఆకలితో అలమటించిన అంజలి(29) తెల్లవారుజామున 5 గంటల సమయంలో మృతిచెందింది. ఉదయం గమనించిన అక్కడున్న వారు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సాయిట్రస్ట్ అధ్యక్షులు విజయసాయి కుమార్, ట్రస్టు సభ్యులు తదితరులు అక్కడి వెళ్లారు. పోలీసులకు సమాచారం అందించి తహశీల్దార్ అనుమతితో ఒక ప్రత్యేక వాహనంలో జెఎన్‌టియు రోడ్‌లోని వైకుంఠఘాట్‌లో అంజలికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

కనీస సాయం కరువు : నాలుగు సంవత్సరాలుగా అనాథ కుటుంబం సాక్ష్యాత్తు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న ఫెర్రర్ విగ్రహం వద్ద నివసిస్తోంది. వారికి ప్రభుత్వం నుంచి అందే కనీస సాయం కూడా కరువైంది. పిల్లలతో భిక్షమెత్తించి వచ్చిన డబ్బుతో రాజు మద్యం తాగేవాడు. అడుక్కుని జీవించే ఆ కుటుంబానికి కనీస గుర్తింపు కార్డు కూడా లేదు. కనీసం వారి కుటుంబానికి బియ్యం కార్డు ఉన్నా అంజలి ఆకలి మరణం జరిగేది కాదు. కేవలం రాజుకు మాత్రమే ఆధార్ కార్డు ఉంది. అంజలికి, వారి ముగ్గురు పిల్లలకు ఆధార్‌కార్డు కూడా లేదు. దీని వల్ల ఆ కుటుంబానికి ఎలాంటి సంక్షేమం అందలేదని తెలుస్తోంది.



ఫాదర్‌ఫెర్రర్ విగ్రహం కింద అంజలి మృతదేహం వద్ద సాయిట్రస్టు సభ్యులు

తాగుడుకు బానిసైన రాజు ఆ పిల్లలను ఏమైనా చేస్తాడని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆ పిల్లలకు హాస్టల్లో ఆశ్రయం కల్పించి వారి భవిష్యత్తుకు బాట వేయాలని మానవతావాదులు కోరుతున్నారు.

పకడ్బందీగా ఎంసిసి అమలు

సి విజిల్ యాప్ ద్వారా 168 ఫిర్యాదులకు పరిష్కారం : కలెక్టర్ ఎం.గౌతమి

అనంతపురం కలెక్టరేట్ : భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) పగడ్బందీగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఆదివారం ఎన్నికల నియమావళిపై సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై మీడియాకు సమాచారం తెలిపారు. సి- విజిల్ యాప్ ద్వారా పోస్టర్‌లు, బ్యానర్‌లు తొలగించలేదని, గోడలపై పార్టీ రంగులు, పేర్లు తొలగించలేదని, ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు మొత్తం 168 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఎన్నికల కమిషనర్ సూచనల మేరకు 100 నిమిషాల్లో ఫిర్యాదులపై విచారణ చేపట్టి పరిష్కారం చూపినట్లు తెలిపారు. ఎంసిసిలో భాగంగా 5036 పోస్టర్‌లు, 2204 బ్యానర్‌లు, 627 గోడలపై పార్టీల రాతలు తొలగించినట్లు తెలిపారు. 2986 నాయకుల విగ్రహాల, ఫోటోలపై వస్త్రములతో కప్పివేయడం జరిగిందన్నారు. సీజర్- ఎఫ్ఎస్‌టి- ఎస్ఎస్‌టి టీమ్‌ల ద్వారా రూ. 16,94,500 లక్షలు నగదు సీజ్ చేశామన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 18 మంది వాలంటీర్‌లు, 5 మంది రేషన్ షాప్ డీలర్‌లు, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్, 1 పంచాయతీ సెక్రటరీని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఎన్నికల నియామవళిని తూచ తప్పకుండా ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఏ ఒక్కరూ ఉల్లంఘించిన చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కనేకల్ చెరువు వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు (పాతచిత్రం)

నాడు విమర్శలు..

నేడు పరామర్శలు!

నేటితో పూర్తి కానున్న 'కాలవ' సెల్ఫీ ఛాలెంజ్

'కాపు' బిజెపిలో చేరికతో

రాయదుర్గంలో ఆసక్తికర రాజకీయాలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్



రాయదుర్గం రాజకీయం ఆసక్తితోపాటు, ఆశ్చర్యకరంగా మారింది. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. అధికారం ముందు అన్నీ దిగదుడుపే.. అనే విషయాలు సరిపోయేలా రాయదుర్గం రాజకీయ నాయకులకు బోధపడేలా చేసింది. ఈ మూడు నెలల (జనవరి నుంచి మార్చి దాకా) కాలం 2024 ఆంగ్ల నూతన సంవత్సరం కొందరికి నూతనోత్సాహం, మరికొందరికి నిరుత్సాహపడేలా చేసింది. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, టిడిపి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మధ్య అభివృద్ధి విషయంలో సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకున్న విషయం తెలిసిందే. కాలవ శ్రీనివాసులు తన హయాంలో జరిగిన అభివృద్ధి పనుల విషయంలో సెల్ఫీల రూపంలో ప్రతి సోమవారం ఒకటి చొప్పున విడుదల చేస్తానని చెప్పి 2023 ఏప్రిల్ 17న సెల్ఫీ చాలెంజ్‌కు శ్రీకారం చుట్టారు. 50 సెల్ఫీ ఛాలెంజ్ ద్వారా జరిగిన అభివృద్ధి పనులను తెలియజేస్తూ ఫొటోతోపాటు నిధులు, జరిగిన అభివృద్ధి వివరాలు తెలుపుతూ సమాచారం ఇచ్చేవారు. 2024 మార్చి 25వ తేదీతో సెల్ఫీ ఛాలెంజ్ పూర్తి కానుంది. ఆరంభించే సమయంలో కాపు రామచంద్రారెడ్డిని ఉద్దేశించి చేసిన ఛాలెంజ్‌లో భాగంగా చేయగా, సెల్ఫీ చాలెంజ్ 40 దాటే క్రమంలో జరిగిన రాజకీయ మార్పుల కారణంగా ఇద్దరి మధ్యా సయోధ్య కుదిరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా కాలవ శ్రీనివాసులు, టిడిపిని పెడ అర్థాలు వచ్చేలా ఉచ్చరించే కాపు రామచంద్రారెడ్డి గతంలో ఒంటికాలిపై లేచేవారు. ఇద్దరి మధ్య దూషణల పర్వం ఓస్థాయిలో జరిగింది. ఈఏడాది జనవరి తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల కారణంగా కాలవ శ్రీనివాసులు నాకు శత్రువు కాదని, రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని స్వయానా కాపు రామచంద్రారెడ్డి విలేకరుల సమావేశంలో చెప్పుకొచ్చారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న మెట్టు గోవిందరెడ్డి కంటే కాపు రామచంద్రారెడ్డి బలమైన అభ్యర్థి అని, తనకంటూ బలమైన వర్గం ఉందని ఇటీవల ఓ ఛానల్ కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కాలవ శ్రీనివాసులు చెప్పడం ఆసక్తికరంగా మారింది. తాజాగా కాపు రామచంద్రారెడ్డి మార్చి 16న బిజెపిలో చేరారు. నాడు విమర్శల పరంపరతో ఆరోపణలు చేసుకున్న కాలవ శ్రీనివాసులు, కాపు రామచంద్రారెడ్డి నేడు పొత్తులో భాగంగా ఫోన్‌లో పరామర్శించుకున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో ఉత్కంఠంగా మారింది. ఇప్పటికే జనసేన నాయకుడు మంజునాథ్ టిడిపి తరపున ప్రచారంలో పాల్గొంటున్నారు. పొత్తు ధర్మంలో భాగంగా కాపు రామచంద్రారెడ్డి టిడిపి అభ్యర్థి తరపున ప్రచారం చేసేందుకు సిద్ధమైనట్లు టిడిపి శ్రేణులు చెబుతున్నారు. ఏది ఏమైనా నాడు పరస్పర ఆరోపణలు చేసుకున్నవారే నేడు ప్రజల్లోకి కలిసి వెళ్లాల్సి వస్తుందని రాయదుర్గం నియోజకవర్గం ప్రజలు బహుశా ఊహించి ఉండరేమో...!

కల్తీ నూనెలతో పొంచి ఉన్న ప్రమాదం



అపరిశుభ్రంగా ఉన్న అండర్ గ్రౌండ్ ట్యాంక్ ప్రదేశం

పండుగల వేళ యథేచ్ఛగా అమ్మకాలు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

నిద్రమత్తులో ఆహార భద్రత అధికారులు..?

ఏం తింటున్నాం, ఎంత తింటున్నాం ఈ రెండు విషయాల చుట్టూనే ఇప్పుడు మనిషి జీవితం నడుస్తోంది. ఆరోగ్యకరమైనదే తింటున్నామా..? ఏది తింటే మంచిది..? ఇంత కంటే మంచివి ఇంకేం తినొచ్చు..? ఇట్లాంటి ప్రశ్నలే బుర్ర నిండా తిరుగుతుంటాయి. డాక్టర్లు కూడా మందుల కంటే ఎక్కువగా తిండి విషయంలోనే దృష్టిపెట్టాలని జనాలకు సలహాలు ఇస్తున్నారు. ఇటీవల వంటనూనెల్లో కల్తీ అనే మాట ప్రతినోట వినిపిస్తోంది. వాటిని ఆరగిస్తే ఆవంటనూనె మంటలో ఆరోగ్యం కలిసిపోవడం ఖాయం. ఈ మధ్యకాలంలో అధిక ధర ఉండే వంటనూనెతో చౌకరకాల నూనె కలపడం లేదా పశువుల కొమ్ములు, ఎముకలు కరిగించి తీసిన నూనెను సాధారణ నూనెలో కలపడం జరుగుతోంది. దీంతో ఆహార భద్రత దృష్ట్యా ప్రభుత్వాలు చట్టాలను కఠిన తరం చేసినప్పటికి కొంత మంది నూనె వ్యాపారులు వారి స్వార్థం కోసం నిబంధనలు అతిక్రమించి కనీసం ట్యాంకర్లను కూడా శుభ్రం చేయకుండానే దర్జాగా లూజు విక్రయాలను జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆహార భద్రత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



దుకాణంలో లూజు నూనెను విక్రయిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పండుగల వేళ కల్తీ నూనెలు యథేచ్ఛగా మార్కెట్లోకి వచ్చేస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కల్తీ నూనె వ్యాపారం జోరుగా సాగుతోంది. జీఎస్టీ లేకుండానే జీరో దందా నడుస్తోంది. హిందూపురం పట్టణంలో భారత్ అయిల్ డిపో, బాలాజీ ట్రేడర్స్ పేరుతో రోజుకు వేలాది లీటర్ల వంటనూనె లూజు విక్రయాలు జరుగుతున్నాయి. ఏకంగా ప్రత్యేక ట్యాంకర్లలను ఏర్పాటు చేసుకుని ఇతర ప్రాంతాల నుంచి వారు దిగుమతి చేసుకుంటున్నారు. నూనెల లూజ్ విక్రయాలపై నిషేధం ఉన్నా అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి. లూజు విక్రయాలపై ఆహార భద్రత అధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాల్సి ఉన్నప్పటికి అలాంటి దాడులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ పూర్తి స్థాయిలో జరపక పోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల రూపాయల్లో కల్తీ వ్యాపారం సాగుతున్నా నియంత్రించే వారు లేకపోవడంతో పండుగ సమయాల్లో కల్తీనూనె, కల్తీ నెయ్యి విక్రయాలతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. డాల్డాలో కృత్రిమ రంగులు కలిపి నెయ్యిగా మారుస్తున్నారు. పసుపు పచ్చ పత్తినూనెతో పల్లినూనె కల్తీ చేస్తున్నారు. తెల్లపత్తి నూనెను పొద్దుతిరుగుడు అయిల్‌లో కలుపుతారనే ఆరోపణలు ఉన్నాయి. కల్తీనూనెకు తోడు నాసిరకం పప్పులు, మసాలా దినుసుల పొడులను ప్రజలకు అంటగడుతున్నట్లు తెలుస్తోంది. వినియోగదారులు తాము కొనుగోలు చేస్తున్న నూనె ఎంత స్వచ్ఛమైనదో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి. వంట నూనెలను ప్లాంట్ నుంచి వ్యాపారులకు రవాణా చేసే ట్యాంకర్లను, వ్యాపారులు వారు స్టాకు చేసుకునే ట్యాంకర్లను పరిశీలిస్తే కల్తీ నూనెల బండారం బయటపడే అవకాశాలు ఉన్నాయి. వంట నూనెలు విచ్చలవిడిగా కల్తీ అవుతున్నాయి. కొన్నింటిలో ఏమాత్రం క్వాలిటీ ఉండటం లేదు. మరికొన్నింటిని వాడటం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కల్తీ వంట నూనెల్లో విషపూరితమైన ఆఫ్లాటాక్సిన్ లు, ఆరోగ్యానికి హాని చేసే హెవీ మెటల్స్ ఉంటున్నట్లు ఫుడ్ సిఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నిర్వహించిన పరీక్షల్లో తేలింది. వంట నూనెల్లో పల్లి నూనె అత్యధికంగా కల్తీ అవుతోంది. ఆ తర్వాత స్థానాలలో సోయాబీన్, రైస్ బ్రాన్, నువ్వుల నూనె, కొబ్బరి నూనె ఉన్నాయి. వంట నూనెల్లో ఎ, డి విటమిన్లు కూడా ఉండాల్సిన స్థాయిలో లేవని వెల్లడైంది. వంట నూనెను ప్యాకెట్లుగా తయారు చేస్తున్న అక్రమార్కులు ఆ ప్యాకెట్లపై ఎలాంటి వివరాలు ఉంచడం లేదు.

లూజ్ ఆయిల్ మరింత డేంజర్..

గత రెండు సంవత్సరాల క్రితం భారత ప్రభుత్వం ఎఫ్ఎస్ఎస్ఎఐ పలు ప్రాంతాలలో వంట నూనెల శాంపిల్స్ సేకరించింది. 4,461 శాంపిల్స్ లను పరీక్షించి వాటిలో క్వాలిటీ, కల్తీ, సేఫ్టీ ఏమేరకు ఉందనే దానిపై ఒక రిపోర్టును విడుదల చేసింది. ఎడిబుల్ ఆయిల్స్ సేఫ్టీపై అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను అలర్ట్ చేసింది. మొత్తం టెస్ట్ చేసిన శాంపిల్స్‌లలో 118 శాంపిల్స్ అస్సలు సేఫ్ కాదని తెలిపింది. ఇలాంటి వాటిని జనాలు కొంతకాలం పాటు తింటే అనారోగ్యానికి గురవుతారని హెచ్చరించింది.

కల్తీపై చర్యలు శూన్యం

జిల్లాలో ప్రధాన పట్టణాలతో పాటు వివిధ మండలాల్లో కల్తీ సరుకుల అమ్మకాలకు అనేక పద్ధతులు ఉపయోగిస్తున్నారు. నూనెల్లో ఆముదం, ఖనిజ తైలం, జంతువుల కొవ్వును కరిగించి కల్తీ చేయడం, సోయాబీన్, పత్తిగింజలు, పామోలిన్ వంటి నూనెలను కల్తీ చేయడం లాంటివి చేస్తున్నారు. నెయ్యిలో కృతిమ రంగులు కలుపుతున్నారు విచ్చల విడిగా ఆహార పదార్థాలు తయారు చేస్తున్నా నియంత్రించిన దాఖలాలు లేవు.

నిద్ర మత్తులో ఆహార భద్రత అధికారులు....?

కల్తీ వంట నూనెతో పాటు కల్తీ ఆహారంపై ఎప్పటికప్పుడు తనఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన ఆహార భద్రత అధికారులు వ్యాపారులు నిద్ర మత్తులో ఉన్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. నెలలో ఒక్క సారి కూడా తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. తనఖీకి వచ్చినా వారు పెద్ద పెద్ద వ్యాపారుల జోలీకి వెళ్లరు. చిన్న చిన్న వ్యాపారుల వద్దకు వెళ్లి తనఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారన్నా ఆరోపణలు వినపిస్తున్నాయి. ఇప్పటికైన మత్తును వీడి తనికీలు నిర్వహించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజారోగ్యాన్ని కాపాల్సిన అవసరం ఉంది.



ట్యాంకర్ నుంచి అన్ లోడ్ చేస్తున్న వంట నూనె

బిసిల ద్రోహి సిఎం జగన్

'ఒంటిమిట్ట' ఘటనకు బాధ్యత వహించాలి : బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలో వైసిపి నేతల భూ దాహానికి బలైన చేనేత కుటుంబ సభ్యుల ఆత్మహత్య ప్రభుత్వ హత్యేలేనని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నిరుపేద కుటుంబం మూడెకరాల భూమి కోసం వైసిపి గూండా నేతలతో పోరాడలేక బీసీ కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. రెవెన్యూ అధికారులు వైసిపి గూండాలకు వత్తాసు పలకడం చూస్తుంటే ఎన్నికలు కూడా సజావుగా జరిగే అవకాశం లేదనిపిస్తోందన్నారు. సిఎం జగన్ సభా వేదికలపై నా బీసీలు అని చెప్తూ బీసీలపై దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా మౌనంగా ఉండటం ప్రజాకంటక ముఖ్యమంత్రిగా భావించవచ్చన్నారు. వైసీపీ నేతల భూ కబ్జాలు, భూదాహానికి ఎన్నో కుటుంబాలు బలయ్యాయన్నారు. చేనేత కుటుంబం మరణానికి కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సొంత జిల్లాలో ప్రజలపై దారుణాలు జరుగుతుంటే ఏమాత్రం స్పందించకుండా ముఖ్యమంత్రి జగన్ మౌనంగా ఉండటం వెనుక ఇంకా ఎన్నికుట్రలు చేస్తారని ఆందోళన కలుగుతోందన్నారు. డిజిపి వెంటనే స్పందించి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-అనంతపురం


పథకాలతో చెస్ క్రీడాకారులు

అనంతపురంలోని కనక దాస కల్యాణ మండపంలో ఏ1 చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలను ఘనంగా నిర్వహించారు. ఆరు రౌండ్ల పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహించగా 72 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ కేటగిరిలో ప్రతిభ చూపి 20 మంది క్రీడాకారులకు ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సౌజన్యంతో రూ.లక్ష నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఛైర్మన్ బాలరాజు, టోర్నమెంట్ డైరెక్టర్ ఇంటూరి కిషోర్‌నాయుడు, కనకదాస కళ్యాణ మండపం వెన్యూ స్పాన్సర్స్ పావురాల జగదీష్, బండి కాశీ విశ్వనాథ్, శీనయ్య, టోర్నమెంట్ కోఆర్డినేటర్ గోవిందరాజులు, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయకుమార్ నాయుడు, ఏ1 చెస్ అకాడమీ అధ్యక్షురాలు అమ్మినేని తులసమ్మ, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ జొన్నగడ్డ గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి సిఎం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-గుత్తి


చర్చి ఫాదర్లకు కరపత్రాలు అందజేస్తున్న వైసిపి క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు వైపి.బాబు

ఏపీలో అన్నివర్గాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన సిఎం జగన్‌ను మరోసారి సీఎం అయ్యేందుకు అహర్నిశలు కృషి చేద్దామని వైసిపి క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు వైపి.బాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బాచుపల్లి గ్రామంలో వైసిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో 'జగనే సీఎం ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని బెతస్థ ప్రార్థన మందిరం పాస్టర్ బిషప్ వై. వాసు అనిల్ కాంత్‌ను నాయకులు కలిసి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వైపి.బాబు మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీలు వైసిపి వైపే ఉన్నారన్నారు. క్రిస్టియన్ మైనార్టీల లభివృద్ధికి కృషి చేసిన సీఎం జగన్, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గెలిచేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జాకోబ్, సాల్మన్, అబ్రహం, వైయస్ బాబు, చరణ్ ప్రమోద, బాచుపల్లి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒఆర్ఎస్ పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం


ఎనర్జీ డ్రింక్స్‌ను అందజేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురం, బుక్కరాయసముద్రం, శింగనమల ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ బాల, బాలికల వసతి గృహాల్లోని విద్యార్థినులకు ఆదివారం ఓఆర్ఎస్ ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని చదువు పట్ల శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా పరీక్షలు అంటే మానసిక ఒత్తిడికి గురి కాకుండా, భయం లేకుండా ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కాగా స్వాతి, రామాంజనేయులు వారి చైత్ర ఏజెన్సీస్ సహకారంతో విద్యార్థినులకు డ్రింక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి బిసి వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ రంగమ్మ, శింగనమ బిసి బాలుర వసతి గృహం అధికారి మస్తాన్, షహంతాజ్, మాధవీలత, అనిత, రవీంద్రనాథ్ ఠాగూర్, ట్రస్టు సభ్యులు సౌధామణి, కిష్టప్ప, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి-పామిడి


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు

మండలవ్యాప్తంగా క్రైస్తవులు ఆదివారం మట్టలాదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చిలో సెక్రటరీ పరదేశీ విజయ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో పాస్టరమ్మ సువర్ణ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు ఈ లోకానికి వచ్చారన్నారు. సర్వ మానవ పాప పరిహారార్థం క్రీస్తు సిలువలో తన ప్రాణం త్యజించడానికి ఈ లోకానికి రిక్తుడుగా వచ్చారన్నారు. అంతకుముందు క్రైస్తవులు మట్టలు చేతబోని కీర్తనలు ఆలపిస్తూ ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, జకరయ్య, అబ్రహం, రత్నరాజు, ప్రభాకర్, దేవదాసు, పీటర్, విజయ్, రూబెన్, కరుణాకర్, బుజ్జిబాబు, రాజు, రత్నబాబు, ప్రసాద్, రజని, చంద్రకళ, సుశీలమ్మ, ప్రిస్కిల్లా, శాంతమ్మ, మాణిక్యమ్మ, రమాదేవి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

'కుర్ని'ల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి-అనంతపురం

కుర్ని కులస్తుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం నగరంలో కుర్ని కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు చేశారన్నారు. కుర్ని కులస్తులకు అభ్యున్నతికి కూడా కృషి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైసిపిని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైసిపి బీసీ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి బీసీ రమేష్‌గౌడ్, అనంతపురం రూరల్ సర్పంచి ఉదయ్‌శంకర్, బీసీ సెల్ రాష్ట్రకార్యదర్శి సంపంగి గోవర్ధన్, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్ బాషా, జ్యోగి రాజేంద్ర, కుర్ని సంఘం అధ్యక్షులు మహదేవ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘు, బీసీ నాయకులు శ్యామ్, చంద్రశేఖర్, కాశన్న, లోకనాథ్, ముకుందప్ప, రామకృష్ణ, విజయ్‌కుమార్, మోహన్, రామచంద్ర, శ్రీహరి, సోమశేకర్, శివప్రసాద్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.


కుర్ని కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన ర్యాలీని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యాధికారి మున్వర్, క్షయ విభాగం వైద్యాధికారి రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ మున్వర్ మాట్లాడుతూ ఎవరైతే మూడు నుంచి ఐదు రోజులపాటు దగ్గు, జ్వరం, బరువు తగ్గడం మొదలైన లక్షణాలతో బాధపడతారో వారు వెంటనే గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు ఇవ్వడమే కాక, నిక్షయ పోషక యువజన కార్యక్రమం కింద వ్యాధిగ్రస్తుల బ్యాంకు ఖాతాకు నెలకు రూ.500 చొప్పున జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్షయ పరీక్ష కేంద్రం పర్యవేక్షకులు సత్యనారాయణ, చికిత్స విభాగం పర్యవేక్షకులు శ్రీకాంత్‌నాయక్, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్‌బాబు, ఐసిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి, హెడ్‌నర్స్ కృష్ణమ్మ, సిబ్బంది శశి, కళావతి, అల్తాఫ్ హుస్సేన్, ఆశా కార్యకర్తలు మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


రాయదుర్గంలో ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

బొమ్మనహాల్ : అంతర్జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని 15 ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడుతూ వారంరోజులకు మించి దగ్గు, ఆయాసం, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్యులు పరీక్షించి క్షయ అని నిర్ధారణ అయితే చికిత్స తీసుకోవాలన్నారు. సరైన సమయంలో చికిత్స తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

గుంతకల్లు టికెట్ జితేంద్రగౌడ్‌కు కేటాయించాలి : టిడిపి

ప్రజాశక్తి-గుత్తి


విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రైతు బాంధవుడు, రాజకీయ చరిత్ర ఉన్న మాజీ ఎమ్మెల్యే రామగౌని జితేంద్రగౌడ్‌కే గుంతకల్లు టిడిపి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మోడే శ్రీనివాస్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్ దాస్, మాజీ ఎంపీటీసీ ఎ.నరసింహులు, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణమ్మ కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో యాదవ సంఘం నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగౌని కుటుంబం మూడు తరాలుగా రాజకీయ రంగంలో రాణిస్తున్నారని చెప్పారు. జితేంద్ర గౌడ్ తోపాటు గతంలో ఆయన తండ్రి రామచంద్ర గౌడ్, సోదరుడు సాయినాథ్ గౌడ్ ఎమ్మెల్యేగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారన్నారు. రైతుల కష్టాలు గుర్తించిన జితేంద్రగౌడ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 12 చెరువులను సాగునీటితో నింపారన్నారు. అంతేగాకుండా జితేంద్రగౌడ్‌కి నియోజకవర్గంలోని ప్రతి వార్డు, ప్రతి గ్రామంలో ప్రత్యేకమైన క్యాడర్ ఉందన్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు టికెట్ల కేటాయింపులో బీసీలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆర్.జితేంద్రగౌడ్‌కు టికెట్ కేటాయిస్తే యాదవులు, కురుబలతోపాటు అన్నివర్గాల ప్రజలకు కలుపుకుని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు వెంకటనారాయణ, రంగారెడ్డి యాదవ్, పెద్దన్న, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ కృష్ణ, టిడిపి నాయకులు నారాయణస్వామి, కిట్ట, వేల్పుల రంగస్వామి, నెట్టికంటయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లౌకికవాదాన్ని కాపాడుకుందాం : సిఐటియు

ప్రజాశక్తి-గుంతకల్లు


భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సిఐటియు, సిపిఎం నాయకులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో లౌకికవాదాన్ని కాపాడుకుందామని సిఐటియు పట్టణ అధ్యక్షులు కసాపురం రమేష్, సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని సిఐటియు కాలనీలో ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నుంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి యువతను ఉద్యమంలో పాల్గొనేలా చైతన్యం చేయడంలో భగత్‌సింగ్ కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి యువత విభజన హామీ హక్కులు, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ, కడప ఉక్కు పరిశ్రమ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కేంద్రం తీసుకొచ్చిన సిఎఎ, ఎన్ఆర్‌సిలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, గణేష్, యశ్వంత్, విక్రమ్, లక్ష్మణ్, ఆరీఫ్, చందు, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రభాకర్‌చౌదరిని ప్రకటించాలి

పలు సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్


విలేకరులతో మాట్లాడుతున్న కులసంఘాల నాయకులు

అనంతపురం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైకుంఠం ప్రభాకర్‌చౌదరిని కేటాయించాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళిత ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు కె.పి నారాయణస్వామి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ అనంతపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకట్రామిరెడ్డి ఒక బలమైన నాయకుడన్నారు. ఎన్నికల్లో అనంత వెంకటరామిరెడ్డికి, సరైన పోటీ, తెలుగుదేశం పార్టీలో ఒక్క ప్రభాకర్ చౌదరి మాత్రమే అన్నారు. అధిష్టానం గుర్తించి ప్రభాకర్ చౌదరికి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు, టిడిపి అధిష్టానం బలిజలకు టికెట్ ఇస్తే వచ్చే ఎన్నికల్లో, దళిత ప్రజా సంఘాల నాయకులు కచ్చితంగా ఓడిస్తామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, దళితులపై కేసులు పెడితే, దళితులకు అండగా ఉన్న ఏకైక వ్యక్తి ప్రభాకర్ చౌదరి అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు ఆనంద్, దాసగాని కుళ్లాయప్ప, చెన్నకేశవులు, మధు, హనుమంతు, బంగి నాగ, హరి భూషణ్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎపి పెన్షనర్స్ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


చంద్రబాబుకు బొకే అందజేస్తున్న పెన్షనర్స్ పార్టీ నేతలు

టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు ఆదివారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రతినెలా 1నన పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వాలన్నారు. క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పాత పద్ధతిలో అమలు చేయాలని కోరారు. బకాయిలు చెల్లించాలన్నారు. పెన్షనర్ల కోసం పెన్షనర్ల సంక్షేమ కార్పొరేషన్ నెలకొల్పాలని, రూ.20 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ చేయాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలకు ఇస్తున్నట్లు పెన్షనర్లకు కూడా మెడిసిన్స్ 50 శాతం డిస్కౌంట్‌కు అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక స్టోర్‌లలో ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. ఇతర ఆర్థిక పరమైన డిమాండ్లతో వినతి పత్రం సమర్పించారు. పెన్షనర్ల పార్టీ అధ్యక్షులు సుబ్బరాయన్, సెక్రటరీ జనరల్ పెద్దన గౌడ్, రాష్ట్ర నాయకులు మున్నెయ విజ్ఞప్తి చేశారు. స్పందించిన చంద్రబాబు ఎన్డీఏ కూటమి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, మూర్తి, రవీంద్ర, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు మండలంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సాయుధ దళాల కవాతు

ప్రజాశక్తి-ఆత్మకూరు

అనంతపురం రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సాయుధ బలగాలు మండలంలోని పి.యాలేరు, పి.సిద్ధరాంపురం, ఆత్మకూరు ముట్టాల, గొరిదిండ్ల గ్రామాల్లో ఆదివారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయుధాలు ధరించి కవాతులో పాల్గొన్న సరిహద్దు భద్రతా దళం, పోలీసు సిబ్బంది కవాతును ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మునీర్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ ఐక్యవేదిక ఏర్పాటు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ నేతృత్వంలో రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య వేదిక ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, రాము నాయక్ తెలిపారు. ఆదివారం విజయవాడలో ఐక్యవేదిక ఏర్పాటు జరిగిందని తెలిపారు. ఛైర్మన్ సూర్యనారాయన నేతృత్వంలో ఐక్య వేదిక పని చేస్తుందన్నారు. తారతమ్యాలు, జంకు లేకుండా సంఘం సేవలను పొందవచ్చన్నారు. సిపిఎస్, జిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణ, 12వ పిఆర్‌సి సత్వరమే అమలు, సకాలంలో డిఎల చెల్లింపు చేయాలని, రూ.25 వేల కోట్లు పైబడి ఉన్న పిఆర్‌సి, డిఎ, ఎస్ఎల్ఎస్, ఎపిజిఎల్ఐ బకాయిలను చెల్లింపు తదితర డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఐక్య వేదిక పని చేయనుందన్నారు. జిల్లాలో కలిసి వచ్చే సంఘాలను కలుపుకుని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల హక్కుల సాధనకు పోరాటం చేయనున్నట్లు తెలిపారు.


సంఘీభావం తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య వేదిక నేతలు

బండారు శ్రావణిశ్రీని గెలిపించుకుందాం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నేతలు

బుక్కరాయసముద్రం : టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని గెలిపించుకుందామని ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి ఆలం నరసానాయుడు పిలుపునిచ్చారు. ద్విసభ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. మళ్లీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాల్సి ఉందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కట్టప్ప రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు, అశోక్‌కుమార్, బాబాఫక్రుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

పామిడి : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని సొరకాయలపేట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు రియల్ ఎస్టేట్ సుబ్రమణ్యం మృతికి పలువురు నివాళులర్పించారు. సుబ్రమణ్యం మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ గ్రామానికి చేరుకుని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కత్రిమల ప్రభాకర్‌చౌదరి, జింకల సంజీవకుమార్, సుంకిరెడ్డి, ముసలిరెడ్డి, హమాలీ గోపాల్, మాజీ స్టోర్ డీలర్ తిమ్మప్ప, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలతో ఎమ్మెల్యే ముఖాముఖి


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవిఆర్

పామిడి : మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆదివారం కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇందులో భాగంగా ఇన్‌ఛార్జి జానకి రామిరెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో వార్డుల వారీగా పలు అభివృద్ధి పనులు, ఎన్నికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మురళీరెడ్డి, జడ్పిటిసి మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి, ఆసీఫ్, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, ఈశ్వర్‌రెడ్డి, అబ్జర్వర్లు, వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పామిడి : మండల కేంద్రంలోని నాగులు కట్ట వీధిలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆదివారం రూ.5వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తనవంతు బాధ్యతగా నగదు వితరణ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు ఇన్‌ఛార్జి నాగూర్ ఈశ్వర్‌రెడ్డి, పామిడి సూరి, మహేశ్వర్‌రెడ్డి, గౌరప్ప, చంద్ర, సూరి, ఉపేంద్ర, రాము, వెంకటేష్, సింహాద్రి, అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'టిడిపితోనే అభివృద్ధి'


టిడిపిలో చేరిన పులకుర్తి నాయకులు

డి.హీరేహాల్ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని పులకుర్తి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పులకుర్తి సర్పంచి వైసీపీ రెబల్ అభ్యర్థి దూనప్ప ఆధ్వర్యంలో దాదాపు 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి కాలవ శ్రీనివాసులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫైట్ ఫర్ రైట్స్ నూతన కమిటీ ఎన్నిక



ఫైట్ ఫర్ రైట్స్ నూతన కమిటీ సభ్యులు

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న రేణుక యల్లమ్మ గుడి ఆవరణలో ఎఫ్ఎఫ్ఆర్ (ఫైట్ ఫర్ రైట్స్) వ్యవస్థాపక అధ్యక్షులు కెపి.రాజు సమక్షంలో ఆదివారం నూతన మండల కమిటీ ఎన్నికయింది. గౌరవాధ్యక్షులుగా కె.శ్రీధర్ (బాచి), అధ్యక్షుడు దాదా ఖలందర్, ఉపాధ్యక్షుడు వీరభద్రయ్య, ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు (బాబు), కోశాధికారి బండల రామాంజినేయులు, సహాయ కార్యదర్శి మధు, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీ దేవమ్మ, నాగేంద్రను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఫ్ ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట నాగరాజు, బిఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం, నాయకుడు వెంకట కొండయ్య, ఎఫ్ఎఫ్ఆర్ నాయకులు సత్యనారాయణ, శంకర్‌రెడ్డి, కె.అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేత పాటిల్ తిమ్మారెడ్డి మృతి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దంపతులు

బెళుగుప్ప : వైసిపి ప్రచార కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు పాటిల్ నాగిరెడ్డి సోదరుడు పాటిల్ తిమ్మారెడ్డి శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి, సతీమణి భువనేశ్వరి, ఉరుకొండ వైస్ ఎంపిపి శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు తిమ్మారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తిమ్మారెడ్డి భార్య త్రివేణమ్మ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పి.శ్రీనివాసులు, ఇరుపాపల్లి రాధాకృష్ణారెడ్డి, మాజీ సర్పంచి రామేశ్వరరెడ్డి, కరుణాకర్, తిమ్మారెడ్డి, రఘురామరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగలింగేశ్వరస్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని నీలంపల్లి గ్రామాలో వెలసిన నాగలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి రథోత్సవం, ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పరిధిలో విరేగించి జల్దీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు నాగమణి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. చిక్కాల ఆదినారాయణబ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.